విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఆరు నెలల్లో స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు

- స్వర్ణకారులకు నారా లోకేష్ హామీ

విశాలాంధ్ర-తాడేపల్లి : సమస్యల పరిష్కారం కోసం సామాన్యుల నుంచి ఉద్యోగులు, యువకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ప్రజా దర్బార్‌కు తరలివచ్చారు. ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాదర్బార్ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. అందరి సమస్యలను ఓపిగ్గా విన్న యువనేత ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరితో పాటు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న సామాన్య ప్రజలు ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా యువనేత తమకు అండగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిఒక్కరి విన్నపాలను స్వీకరించి నారా లోకేష్ ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి చొరవ తీసుకోవడం ప్రజా ప్రభుత్వ పాలనకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు.

రైతులకు ఫౌండేషన్ విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : మండల పరిధిలోని చిర్రావూరు గ్రామ లైబ్రరీ సెంటర్‌లో మంగళవారం ఒక ఎకరాకు 25 కేజీల బ్యాగ్ చొప్పున రైతులకు ఫౌండేషన్ విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు 50 శాతం సబ్సిడీ కింద ఫౌండేషన్ విత్తనాలు ఇస్తున్నామని, రైతు బాగున్న ప్పుడే దేశం కూడా బాగుంటుందన్నారు. అలానే రైతు సంతోషంగా ఉండే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. రైతులకు సంబంధించిన పరికరాలు, ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీ విత్తనాలు, పంట సమయంలో గోనె సంచులు, టార్పన్ పట్టాలు అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, తాడేపల్లి మండల జనసేన ప్రధాన కార్యదర్శి లాల్ చంద్ పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ పరీక్షల ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఫిబ్రవరి/మార్చి నెలలో నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) కోర్సుల ఫలితాలను మంగళవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ విడుదల చేశారు. అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ఇయర్ ఎండ్ సప్లిమెంటరీలో బీఏ, బీకాం(జనరల్) (కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ, బీహెచ్ఎం, బీబీఏ, బీబీఎం, బీఎస్సీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), బీఎస్సీ (ఫ్యాషన్ టెక్నాలజీ) కోర్సుల ఫలితాలను విడుదల చేశారు. ఈ కోర్సులకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు జులై 4వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.770లు చెల్లించి 9వ తేదీలోగా దూర విద్యా కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్‌కు ఆయా దరఖాస్తులు అందేలా పంపాలని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైను లాబ్దిన్ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు సెమిస్టర్ విధానంలో జరిగిన ఈ పరీక్షలకు ఎంకామ్, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎల్ఐ ఎస్సీ, సోషల్ వర్క్, బీఎల్ఐఎస్సీ, ఎంఏ ఇంగ్లీష్, ఎకనామిక్స్, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సంస్కృతం సోషియాలజీ, తెలుగు, జర్నలిజం కోర్సుల ఒకటి, రెండు, మూడు, నాలుగు సెమిస్టర్ల ఫలితాలు ఉన్నాయి. ఈ కోర్సులకు రీవాల్యుయేషన్ దర ఖాస్తు చేసుకోవాలంటే జూలై 4వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.960లు చెల్లించి జూలై 9వ తేదీలోగా దరఖాస్తులు అందేలా పంపాలి. బీఎల్ఐఎస్సీ కోర్సుకు మాత్రం రూ.770లు చెల్లించాల్సి ఉంటుంది. ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ www.anucde.infoలో పొందుపరిచినట్లు పరీక్షల కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సోమశేఖర్ తెలిపారు. ఫలితాల విడుదల సందర్భంగా రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.నాగరాజు, పరీక్షల అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో అకాడమి వారికి స్వర్ణ పతాకాలు

విశాలాంధ్ర-తెనాలి : కె.యస్.ఆర్. తైక్వాండో అకాడమి క్రీడాకారులు రేపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో నాలుగు స్వర్ణ పతాకాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఒరిస్సా, కటక్‌లో జరగబోయే జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు కూడా ఎంపికయ్యారని చెప్పారు. సీనియర్ విభాగంలో కె.శ్రీనివాసరావు స్వర్ణం, జూనియర్ విభాగంలో కె.భువనశ్రీ స్వర్ణం, పి.గౌరిలక్ష్మికి స్వర్ణం, బి.జ్యోతేం ద్రకు స్వర్ణం. మొత్తం నాలుగు స్వర్ణపతాకాలు సాధించినందుకు గాను బోస్‌రోడ్డులోని కె.యస్.ఆర్. తైక్వాండో అకాడమి హాలులో ఏపి తైక్వాండో జనరల్ సెక్రటరి గ్రేసీ ఫౌండేషన్ అధినేత కైతెపల్లి శ్యాముల్‌రాజులు క్రీడాకారులను అభినందించి సత్కరించారు.

మొక్కు తీర్చుకున్న గళ్ళా మాధవి



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపు కోసం మొక్కుకున్న తెలుగు దేశం పార్టీ నేతలు మంగళవారం తమ మొక్కులు తీరుచుకున్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యి బాబా వారికి చాదర్ పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యే మాధవికి ఫకీర్లతో ఎదురెళ్లి స్వాగతం పలికారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం.1101/2024/ఇ1 తేది: 25-06-2024

నిట్ నెం.04/జె.టి.ఓ/2024-25

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధుల క్రింద ఈ దిగువ ఉదహరించిన పనికి ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు - 06 నెం.లు పని నెం. 01 నుండి 05 లకు :	అంచనా వ్యయము రూ.54.80 లక్షలు
1. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.26-06-2024 ఉదయము గం.11.00ని.ల నుండి
2. టెండర్ల షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేదీ	: ది.29-06-2024 ఉదయము గం.11.00ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేదీ	: ది.29-06-2024 మధ్యాహ్నము గం.02.00ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం.9849907303

సం/- వి.నిర్మల్ కుమార్, కమిషనరు,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

పూడికతీత పనులు వేగంగా చేపట్టాలి

◆ కమిషనర్ కీర్తి చేకూరి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన ఔట్ ఫాల్ డ్రైన్లలో పూడికతీత పనులను వేగంగా చేపట్టాలని, పనులకు ముందు, అనంతరం ఫోటోలు తీయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ బుడంపాడు, సంగడిగుంట, కమ్మ శేషయ్య గ్రౌండ్ రోడ్, నల్లచెరువు తదితర ప్రాంతాల్లోని అవుట్ ఫాల్ డ్రైన్లలో జరుగుతున్న పూడికతీత పనులను ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వర్షం నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వ యంతో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వర్షాలకు ఎక్కడా వర్షం నీరు నిల్వ ఉండకుండా అధికా రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్లలో పూడికతీత పనులు త్వరగా పూర్తి చేసి, ప్రతి ఏడాది వర్షాలకు పొంగే ఇంటర్నల్ డ్రైన్లలో కూడా పూడిక తీయడానికి, వాటిపై ఉన్న ఆక్రమణల తొలగింపుకు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పూడికతీత పనులను ఎమినిటి కార్యదర్శులు దగ్గరుండి పర్యవేక్షణ చేయాల న్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో స్థానికుల సంతకాలు తీసుకోవాలని అన్నారు. పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసీ) మధుసూదన్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఎస్ఎస్‌లు రాంబాబు, రాంబాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి

- మంత్రి నారా లోకేష్‌ను కోరిన స్వచ్ఛంధ ప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు విధానంలోనే విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ స్వచ్ఛంధ ప్రసాద్ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజా దర్బార్‌లో మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్వచ్ఛంద ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 11,500 మంది స్టాఫ్ నర్సులను ప్రస్తుత ప్రభుత్వం రెగ్యులర్ చేసి న్యాయం చేస్తుందని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే ఇచ్చిన మాట నెరవేరుస్తూ మెగా డీఎస్సీపై సంతకం చేయడం, ప్రజా దర్బార్ లాంటి కార్యక్రమాలతో ప్రజలతో మమేకం అవ్వడం మరింత నమ్మకాన్ని పెంచిందన్నారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వాల చేతిలో మోసపో తున్న వ్యవస్థ నర్సింగ్ వ్యవస్థ అని, కరోనా సమయాల్లో రోగుల ప్రాణాలు కాపాడటానికి అనేక మంది కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ప్రాణత్యాగం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ దానికి ముందే నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నారా లోకేష్‌ను కలిసి విన్నవించిన విషయాన్ని గుర్తు చేశామన్నారు. తమ ప్రభుత్వం రాగానే నర్సులకు న్యాయం చేస్తామన్న హామీ మేరకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జీజీహెచ్ మేల్ స్టాఫ్ నర్సు సురేష్ తదితరులు ఉన్నారు.

కాబోతూ రామస్వామి వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తుళ్లూరు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడికొండ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన గుంటూరు సీపీఐ కార్యాలయంలో జరిగే అమరజీవి కాబోతూ రామస్వామి వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం తుళ్లూరులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం తాడికొండ నియోజకవర్గ గౌరవాధ్యక్షులు గుర్రంకొండ సత్యానందం, కార్యదర్శి కంభంపాటి దేవుని దయ, ఎం.సురేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణకు పకడ్బందీ చర్యలు: కమిషనర్

విశాలాంధ్ర-మంగళగిరి : డయేరియా నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ అన్నారు. మంగళగిరి కార్యాలయ కౌన్సిల్ హాలులో స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024 నియంత్రణ అవగాహన కార్యక్రమాలను మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డయేరియా నియంత్రణ కార్యక్రమాలకు అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాల నిర్వహణపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులకు సూచనలిచ్చామన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. నీటి సరఫరా పర్యవేక్షణ, నీటి నాణ్యత కోసం ఆర్సీహెచ్, ఈకోలై పరీక్షలు చేయడం, లీకేజీలను నివారించడం తదితర పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఎస్ఈని ఆదేశించారు. అంగన్‌వాడీ వర్కర్లతో సమన్వయం చేసుకొని మూడేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడడం, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సీడీపీవోకు సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమన్వయం చేసుకొని వార్డు సచివాలయాలు, రాత్రి వసతి కేంద్రాలు, హోటల్స్ ఇతర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుబ్బరాజు, ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్, ఏసీపీడీఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉమా యాదవ్‌కు ప్రముఖులు నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి :మంగళగిరి ద్వారకా నగర్‌లో మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయ కులు తాడిబోయిన ఉమా యాదవ్ 5వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఉమా యాదవ్ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీ నాయకులు, యాదవ్ సంఘం ప్రముఖులు, ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం పార్టీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమా యాదవ్ కుటుంబానికి దేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉమా యాదవ్ పేరుతో ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి ఆయన సోదరుడు డాక్టర్ మహేష్ యాదవ్ సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయ మన్నారు. నియోజకవర్గ సీపీఐ కార్య దర్శి చిన్ని తిరుపతయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆరుద్ర భూలక్ష్మి, ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ తాడిబోయిన మహేష్ యాదవ్, దేశం నాయకులు దామర్ల రాజు, భోగి వినోద్, షేక్ రియాజ్, జొన్నాదుల బాలకృష్ణ, గోవాడ దుర్గారావు, గాజుల శ్రీనివాస రావు, పిల్లెళ్ళ నాగరాజు తదితరులు ఉమా యాదవ్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా తాడేపల్లి పట్టణం, తాడేపల్లి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 56వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 80 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. మహిళల అభ్యున్నతి కోసం, వారి జీవనోపాధి కోసం కృషి చేస్తున్న మంత్రి నారా లోకేష్‌కు కుట్టుమిషన్లు అందుకున్న లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి మాట్లా డుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నారా లోకేష్ పనిచేస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల న్నింటినీ అమలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి: డీఈఓ

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఆవాస ప్రాంతంలోని బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్, పాఠ్యపుస్తకాలు త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. స్టూడెంట్ కిట్స్, పాఠ్యపుస్తకాల పంపిణీలో నిబంధన లను పాటించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం ఏర్పడే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా రోజువారి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. పిల్లల ను బడిలో చేర్పించే క్రమంలో గ్రామస్తుల సహకారం తీసుకోవాలని సూచించారు.

భ్రమరాంబ సమేత రాజమల్లేశ్వర స్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర-తుళ్లూరు : అమరావతి రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో భ్రమరాంబ సమేత రాజమహేశ్వర స్వామి వారి 9వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి అభిషేకాలు చేసి తదనంతరం కల్యాణం జరిపించారు. తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. నాట్కో వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు లక్ష్మీ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్కే రైట్ హ్యాండ్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లి పంచాయతీలో మహిళ పారిశుద్ధ్య కార్మికులపై లైంగిక వేధింపులతో పాటు ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న సూపర్‌వైజర్ పిల్లి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రైట్ హ్యాండ్‌గా పేరుగాంచిన డి.రాంబాబును విధుల నుంచి తొలగించా లని మహిళా కార్మికులు నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. మహిళా కార్మికులపై ఇష్టాను సారంగా వ్యక్తిగత ధూషణలకు దిగడంతో పాటు వేతనం తగ్గించారని ఫిర్యాదు చేశారు. తమ వేతనాలు పెంచాలని, రైతు కూలీ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని యువనేతను కోరారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు.

డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహణ

విశాలాంధ్ర-మంగళగిరి : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక దవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా మంగళవారం మంగళగిరిలోని వేనిగళ్ల తాతారావు, జంజనం మంగళాద్రి(వీటీజేఎం) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతక్రింది కనకయ్య(సీకే) జూనియర్ కళాశాలలో వినూత్నంగా 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహించారు. విద్యార్థులందరూ నేను 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' అని ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంతో ఉన్నతమైన భవిష్యత్తును ఆశించే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార భాగంగా డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్‌లో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 24 నుంచి 30వ తేది వరకు ఎన్‌టీఆర్ గుంటూరు జిల్లా పరిసర ప్రాంతాలలో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ విద్యార్థులతో నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతకు రూ.5 వేల నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మున్సిపల్ కమిషనర్ విస్తృత పరిశీలన

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పురపాలక సంఘ వార్డులలో తెనాలి మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న మంగళవారం విస్తృతంగా తిరిగి మురుగుకాలువలు, రోడ్లు పరిసర ప్రాంతాలు వంతెనలు క్షుణ్ణంగా పరిశీలిం చారు. వార్డులలోని కాలువలలో పేరుకుపోయిన సిల్టులను పారిశుద్ధ్య కార్మికులచేత శుభ్రం చేయించారు. గంటల తరబడి మురుగును తీసివేయడంలో కార్మికులు నిర్విరామంగా పనిచేశారు. రోడ్లు పరిశుభ్రం చేసే కార్మికులకు సూచనలు చేశారు. పట్టణం పరిశుభ్రతతో ఉండాలని, అందువలన ఏ వ్యాధులు రాకుండా ప్రజలు పురపాలక సంఘం వారితో సహకరించాలని కోరారు. వంతెనలు పరిస్థితిని పరిశీలించారు. భవిష్యత్తులో తెనాలి పట్టణం పరిశుభ్రతలో ప్రధమ స్థానంలో ఉండాలని, అందుకు ప్రజలు సహకరించాలి కోరారు.

29న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఎస్పీ తుషార్ దూడి

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లాలోని అన్ని కోర్టులలో ఈ నెల 29వ తేదిన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు త్వరితగతిన కేసులు పరిష్కారం కోసం సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ ఇరుపక్షాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వీలైనంత వరకు ఎక్కువగా కేసులు డిస్పోజల్ చేయాలని ఎస్పీ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో ఇరుపక్షాల సమ్మతితో వారి వారి కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. ఇతర కేసులను కూడా వీలైనంతవరకు ఎక్కువగా డిస్పోజల్ చేయాలని తెలిపారు. కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు వారి కేసులను లోక్‌అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకొనేందుకు ముందుకు రావాలని, కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని, సత్వరం పరిష్కారం లభిస్తుందని, ఇరుపక్షాల మధ్య స్నేహపూరిత సంబంధాలు ఉంటాయని చెప్పారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసిన డేగల

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి పవన్ కళ్యాణ్‌ను తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభా కాంక్షలు తెలియజేశారు.

తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం

- హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మాజ

చెక్కలు మరియు మురుకులు తయారు చేసే యంత్రం గురించి తెలుసుకుంటున్న రైతులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మాజ పేర్కొన్నారు. పంట దిగుబడులు పెంచడంలో తేనెటీగలు ప్రధాన పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రస్తుతం ఉన్న మన జీవనశైలి, రైతులు పంటల సాగులో ఉపయోగించే విష రసాయనాల వలన తేనెటీగలు అంతరించిపోతున్నాయని స్పష్టం చేశారు. తేనెటీగలు అంతరించినట్లయితే మనిషి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని హెచ్చరించారు. తేనెటీగల పెంపకంతో ఆదాయం పొందడంతో పాటు వ్యవసాయంలో పంట దిగుబడులు పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. కొర్నెపాడు గ్రామంలోని రైతునేస్తం ఫౌండేషన్ నిర్వహిస్తున్న మూడు రోజుల రైతు శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సేంద్రీయ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతో పాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు తదితర అంశాలుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉండే ఆకు కూరలు, కూరగాయలు చాలా వరకు రసాయనాలతో పండించినవే అందుబాటులో ఉంచుతున్నారని, అయితే కొన్నిసార్లు రైతులు రసాయనాలు పిచికారి చేసిన వెంటనే కూరగాయలు, ఆకు కూరలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచడం వలన వాటిలో ఉండే విష రసాయనిక అవశేషాలు ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సేంద్రీయ రైతులు మీసాల రామకృష్ణ, శబరీనాథ్, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శిని కలిసిన జాస్తి, మునిరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తపు మునిరెడ్డిలు న్యూఢిల్లీలోని కేంద్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి విజయకుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థలకు, గ్రామ పంచాయితీలకు కేంద్ర ప్రభుత్వం పంపిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారిమళ్ళించినట్లు విజయ్‌కుమార్‌కు తెలిపారు. ఆలాగే స్థానిక సంస్థలు, ప్రజా ప్రతినిధులు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం రెండవ క్వార్టర్ రూ.998.84 కోట్లు కేంద్ర నిధులు ఈ సంవత్సరం మార్చి 28వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేయడం జరిగిందన్నారు. కానీ ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు, స్థానిక సంస్థలకు జమ చేయకుండా 15వ ఆర్థిక సంఘం నిబంధనలకు విరుద్ధంగా ఆ నిధులను డైవర్ట్ చేసినట్లు వారికి తెలియజేశారు. కేవలం జీఓలను జారీ చేసి చేతులు దులుపుకున్నట్లు ఆరోపించారు. స్పందించిన విజయ్‌కుమార్ తప్పకుండా ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 5వ ఆర్థిక సంఘం నివేదికను కూడా అసెంబ్లీలో ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రావాలంటే ఈ తీర్మానాలు కూడా కావాలన్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-పెదనందిపాడు : గుంటూరు ఛానల్ పొడిగింపునకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని గుంటూరు జిల్లా సీపీఎం కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల శాఖ సర్వసభ్య సమావేశం కొత్త వెంకటశివరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాశం రామారావు మాట్లాడుతూ 50 గ్రామాలకు త్రాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ పొడిగింపులో భాగంగా గత ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చి నిధులు మంజూరు చేయకుండా ఈ ప్రాంత రైతులను మోసగించారని, నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే రైతులకు నిధులు మంజూరు చేసి గుంటూరు ఛానల్ పొడిగింపు పనులను ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, మర్రి లక్ష్మి, పి.భువనేశ్వరి, పి.సలీం, చుక్కా యానాదులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

చిలకలూరిపేటకు రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రజల ఆకాంక్షాలను గౌరవిస్తూ, వారి సమస్యల సాధన కోసం నిత్యం ప్రయత్నిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట రైల్వేలైన్ సాధన సమితి కన్వీనర్ షేక్ సుభాని, సభ్యులు మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. చిలకలూరిపేటకు రైల్వేలైన్ ఏర్పాటుకు గతంలో హామీ ఇచ్చిన మేరకు కృషి చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సమాధానం ఇస్తూ చిలకలూరిపేటకు రైల్వేలైన్ అత్యవసరమని, ఈ దిశగా తన వంతుగా ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి రైల్వేలైన్ ఏర్పాటు దిశగా ప్రయత్నిస్తానని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే ప్రభుత్వం తమదని వెల్లడించారు. చిలకలూరిపేటకు రైల్వేలైన్ ఏర్పాటు వల్ల బహుళ ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమలకు ఎగుమతి, దిగుమతి సులభతరం అవుతుందని, వివిధ ప్రాంతాల నుంచి ఈ ప్రాంతంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు రవాణా వ్యవస్థ మెరుగుపడే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు కొండవీడు లాంటి పర్యటక కేంద్రం అభివృద్ధి చెందుతుందని, చిలకలూరిపేటకు రైల్వేలైన్ వల్ల ఈ ప్రాంతం అన్ని విధాలుగా పురోగమిస్తుందని వివరించారు. కార్యక్రమంలో రైల్వేలైన్ సాధన సమితి సభ్యులు మల్లిఖార్జున్, నవీన్‌లు ఉన్నారు.

కోస్తాంధ్ర పద్మశాలి సంఘం కార్యదర్శిగా చిల్లపల్లి

విశాలాంధ్ర-పెదకూరపాడు : విజయవాడలో జరిగిన కోస్తాంధ్ర పద్మశాలి సంఘం సమావేశంలో పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల పరిధిలోని లగడపాడు గ్రామానికి చెందిన చిల్లపల్లి సత్యం కోస్తాంధ్ర పద్మశాలి సంఘం కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చిల్లపల్లి సత్యం ఇప్పటికే జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. సత్యం మాట్లాడుతూ పద్మశాలిలు కూడా రాజకీయంగా సాధికారత దిశగా అడుగులు వేయాలని, చేనేత పరిశ్రమ పునరీజ్వం పొందాలని అందుకు పద్మశాలిలు చేనేత రంగంలో సాంకేతికత అంది పుచ్చుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా ఇకనుంచి పద్మశాలిల ఐక్యత కోసం, హక్కుల సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ భాధ్యత అప్పజెప్పిన పెద్దలకు, పద్మశాలిలు, చేనేత కార్మికులకు ఋణపడి ఉంటానన్నారు.

వైసీపీ కార్యాలయానికి అన్ని అనుమతులు : గోపి రెడ్డి

విశాలాంధ్ర-నరసరావుపేట: లింగంగుంట్ల అగ్రహారం పరిధిలోని రెవెన్యూ శాఖకు సంబంధించిన స్థలాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 33 ఏళ్లకు లీజుకు తీసుకొని జిల్లా పార్టీ కార్యాలయాన్ని నిర్మించిందని, ఇందుకు సంబంధించిన అనుమతులన్నిటిని తీసుకున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పుడా అధికారులు మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నిర్మాణం అనుమతులు లేకుండా చేపట్టారని ఇందుకు సంబంధించి సమాధానం చెప్పాలని కోరుతూ కార్యాలయం గోడకు అధికారులు నోటీస్ అంటించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కార్యాలయాన్ని సందర్శించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా పార్టీ కార్యాలయాలు నిర్మాణాలపై తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం దురుద్దేశంతో నోటీసులు అందజేస్తుందని అన్నారు. పార్టీ కార్యాలయాలకు స్థలాలు సేకరించే కార్యక్రమాన్ని మొదట తెలుగుదేశం పార్టీ ప్రారంభించిందని, 2014-19 సంవత్సరాల్లో సుమారు పది జిల్లాల్లో తెలుగుదేశం ప్రభుత్వం తమ పార్టీ కార్యాలయాలకు స్థలాలను 33 ఏళ్లు, 99 ఏళ్ళుగా నిర్ణయించి ప్రత్యేక జీవలను తీసుకువచ్చిందని, స్థలాలను లీజుకు తీసుకున్నారని అన్నారు. దురుద్దేశంతో తమ పార్టీ కార్యాలయ పై నోటీసులు అంటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి పార్టీ కార్యాలయం విషయంలో హైకోర్టు స్టే మంజూరు చేసిందని, ఆర్డర్ వచ్చేలోపే కార్యాలయాన్ని కూల్చి వేశారని డాక్టర్ గోపిరెడ్డి అన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాజావలి మాస్టారు పాల్గొన్నారు.

గ్లోబల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆటలు ఆడటం వలన విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని బాలానంద కేంద్రం అధ్యక్షులు డాక్టర్ ఎం.రాధాకృష్ణ మూర్తి పేర్కొన్నారు. గ్లోబల్ ఫోర్స్ ఫౌండేషన్, లోటస్ ఆధ్య సంయుక్తంగా స్థానిక కృష్ణ నగర్‌లోని లోటస్ ఆధ్యా స్కూల్ ఆవరణంలో జరిగిన వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి గురుదత్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ఆటలు ఆడటం అలవర్చుకోవాలని కోరారు. క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు గ్లోబల్ స్పోర్ట్స్ కార్యదర్శి శివప్రసాద్‌ను అభినందించారు. కార్యదర్శి గురుదత్ మాట్లాడుతూ నోటస్ ఆధ్య స్కూల్ వారు క్రీడలను ప్రోత్సహిస్తున్నందుకు కరస్పాండెంట్ వెంకటేశ్వర రావు, డైరెక్టర్ ఉమాదేవిని అభినందించారు. వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు లోటస్ ఆధ్య స్కూల్ వారు తమంత ప్రోత్సాహం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్కూల్ పీఈటీలు చక్రి, కె.రవి, కె.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాలు నైపుణ్యాన్ని వెలికితీస్తాయి : శ్రీకాంత్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : క్రీడా శిక్షణ శిబిరాల వలన క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయటానికి దోహదపడతాయని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ అన్నారు. గత 40 రోజులుగా అతనికి అసోసియేషన్ గుంటూరు జిల్లా సహకారంతో తమ స్కూల్ ఆవరణలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహించామని, ఈ శిబిరంలో దాదాపు 30 మంది అథ్లెటిక్ క్రీడాకారులు కోచ్ జీజే కిషోర్ వద్ద శిక్షణ పొందినట్లు చెప్పారు. ఇలాంటి శిబిరాలు నిర్వహణ వలన క్రీడాకారులు క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకుంటారని తెలిపారు. నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో క్రీడలను బాగా ప్రోత్సహిస్తున్నారని గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ అన్నారు. అతిథులు గమ్మిడి సాంబశివరావు, సెక్రెటరీ మోడ్రన్ పాంటలూన్, జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి జీవీఎస్‌లు క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీజే కిషోర్, పవన్ కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణాలు అందజేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో అర్హులైన రైతులందరికీ ఋణాలు అందించే విధంగా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని జిల్లా కలక్టర్ శ్రీకేష్ బి లాట్కర్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం లోని యస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులతో గత ఏడాది డిసెంబరు నుండి ఈ ఏడాది మార్చి త్రైమాసికానికి సంబంధి ంచి డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటి, డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశానికి సంబంధిత బ్యాంక్ కంట్రోలర్లు, సంబంధిత జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. అప్పుడే పూర్తి స్థాయిలో సమీక్షకు అవకాసం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశానికి గైర్హాజరైన బ్యాంక్, ఇతర అధికారుల నుండి వివరణ కోరాలని యల్.డి.యంకు సూచించారు. రాబోయే సమావేశానికి అందరు హాజరయ్యేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 283 బ్యాకులు ఉన్నాయని, కొత్తగా ఏమైనా బ్రాంచ్‌లు ప్రారభామవుతున్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న త్రైమాసిక సమావేశానికి బ్యాంకుల వారీగా పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలపై సమీక్షిం చారు. రుణాల మంజూరులో బ్యాంకర్లు సహకరించాలన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి యల్.డి.యం, మెప్మా అధికారులు సంయుక్తంగా పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి ఎంత మందికి గృహాలు మంజూరు చేసారు, ఎంతమంది రుణాలు తీసుకున్నారు, రుణాలు తీసుకున్న వారు ఎంతమంది సకాలంలో రుణాలు చెల్లిస్తున్నారు వివరాలు తెలియజేయాలన్నారు. మొత్తం 22 అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమములో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటి, డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి టి.మాధురి, ఎల్‌డీఎం రాం ప్రసాద్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ అధికారి బాలూ నాయక్, పరిశ్రమల శాఖధికారి వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, జిల్లా ఉద్యాన వన శాఖాధికారి రామణా రెడ్డి, పశు సంవర్ధక శాక అధికారి కాంతా రావు, ఆర్‌బీఐ ప్రతినిది సునీల్, నాబార్డ్ అధికారి శరత్, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డును కాస్త పట్టించుకోండి.....

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సుబ్బయ్య తోట రాయుడు కంటి ఆస్పటల్ రోడ్డులో సచివాలయం వద్ద జాతీయ రహదారిని కలిపే లింకు రోడ్ శిథిలావస్థకు చేరిందని సీపీఐ నాయకులు నాయుడు శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు చాలకాలం కింద టనే మరమత్తులకు గురైందని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఇదే విషయంపై తాను అనేక విజ్ఞప్తులు చేసినా అధికారులు స్పందించలేదన్నారు. వెంటనే రోడ్డు మరమత్తు పనులు చేపట్టాలని కోరారు.

అమరలింగేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర-అమరావతి : శైవక్షేత్రాలలో అగ్రగామిగా వెలుగొందుతున్న శ్రీ బాల చాముండికా సమేత అమరలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరేశ్వర ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో రాష్ట్ర కార్మిక మంత్రికి స్వాగతం పలికి స్వామి వారి దర్శనార్థం ఆలయంలోకి ఆహ్వానించగా ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉన్నతాధికారులు, అమరావతి గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

డా.అంజిరెడ్డి హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లా నరసరావుపేట డా.అంజిరెడ్డి హాస్పిటల్‌లో మొట్ట మొదటిసారిగా ఏఎస్‌డి క్లోజర్ సహాయంతో పేషెంట్‌కు గుండెలో గదులను సపరేట్ చేసి మిషన్ ద్వారా పేషెంట్ ప్రాణాలు కాపాడిన డా.అంజిరెడ్డి హాస్పిటల్ వైద్య బృందంను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అభినందించారు. డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌ను డాక్టర్ అరవింద బాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుదైన రికార్డును బద్దలు కొట్టిన డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వైద్య బృందం 100మంది పుట్టు మూగ చెవిటి పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ అనే సర్జరీ ద్వారా వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపి వారి తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం ఏర్పరిచారు. మొదటగా చాగంటి వారి పాలెం చెందిన సీహెచ్ పున్నమ్మ అనే పేషెంట్ తీవ్రమైన గుండె నొప్పితో నరసరావుపేట పట్టణంలోని అన్ని హాస్పిటల్స్ తిరిగి చివరగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌కి వచ్చి ప్రముఖ గుండె వైద్యులు అయినటువంటి డా.కోట శబరిగిరీష్ దగ్గర చూయించు కోవడం జరిగిందనీ రిపోర్ట్ చూసిన తదనంతరం పేషెంట్ యొక్క గుండెలోని రెండు గదులకు రంధ్రం ఉందని తెలిపారు. దాంతో సర్జరీ చేయాలని పేషెంట్లకు చెప్పి వాళ్ళ ఒప్పిదం తదనంతరం ఆపరేషన్ చేసి పేషెంట్ యొక్క ప్రాణాలు కాపాడారన్నారు. ఇలాంటి అరుదైన గుండెకు సంబంధించిన ఆపరేషన్లో మహానగరాలైన టువంటి హైదరాబాద్, ముంబాయి, బెంగళూరు, చెన్నై నగరాల్లో జరుగుతాయని ఇప్పుడు మన పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో ఇలాంటి సంక్లిష్టమైన ఆపరేషన్‌ని చేయగలుగుతున్నామని తెలిపారు. ఇదే కాకుండా మరో రెండు పుట్టుకతో మూగ చెవుడు సంబంధించిన చిన్నపిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ అనే సర్జరీ చేసి వారికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ అరవింద బాబు చేతుల మీద మంగళవారం స్విచ్ ఆన్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ నందు పల్నాడు జిల్లాలో ఎటువంటి ఆపరేషన్ అయినా చేయగలరని దానికి సంబంధించిన వైద్య బృందంతో పాటు వైద్య పరికరాలు కూడా ఉన్నాయని ఎంతో సంక్లిష్టమైన గుండెకు సంబంధించిన సర్జరీలు, పుట్టుకతో మూగా, చెవిటి పిల్లలకు సంబంధించిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసి మన పల్నాడు జిల్లాలో కాకుండా ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద మంచి పేరు సంపాదించి మన పల్నాడు జిల్లాకు కూడా పేరును రెండింతలు పెంచేలాగా చేశారని కొనియాడారు. డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ యొక్క వైద్య బృందానికి, హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్‌లోకి రెడ్డి శ్రీనివాస రెడ్డికి అభినందనలు తెలిపారు. పక్క జిల్లాల పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగపరుచుకోవాలనితెలిపారు.

త్రాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

- అధికారులతో ఎంపీపీ సమీక్ష

విశాలాంధ్ర-దుర్గి: గ్రామాల్లో త్రాగునీరు, పారిశుద్ధ్యం పై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మంగళవారం పారిశుద్ధ్యం, త్రాగు నీరుపై ఎంపీడీవో అధ్యక్షతన అధికారు లతో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన అధికారులకు పలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులపై అధికారులు ప్రజలకు అవగాహన కలిగించి అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నీళ్ళ ట్యాంకులను క్లోరినేషన్‌తో శుభ్ర పర్చాలని, ట్యాంకులు ముందు బ్లీచింగ్ చల్లి శుభ్రంగా ఉంచేందుకు పలు చర్యలు చేపట్టాలన్నారు. ఉత్తమమైన పారిశుద్ధ్య పద్దతులను పాటించాలని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ మాట్లాడుతూ అధికారులకు క్లోరినేషన్ చేసే విధానాన్ని వివరించారు. క్లీనింగ్, ఫిల్లింగ్ అనంతరం ట్యాంకుల్లో తీసుకో వలసిన జాగ్రత్తలను తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వారి వారి గ్రామ పంచాయతీలలో సీజనల్ వ్యాధుల కేసులు తలత్తెకుండా చూడాలని సూచించారు. గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో అన్ని గ్రామాల్లో ప్రజల రక్షణ సౌకర్యార్థం చర్యలు చేపట్టాలని ఎంపీడీవో గుప్తా సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థలకు చెందిన బస్సులుపై తనిఖీలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పాఠశాలలు, కాలేజీలు పున: ప్రారంభమైన సందర్భంగా విద్యా సంస్థలకు చెందిన బస్సులపై రవాణా శాఖ అధికారులు మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు గుంటూరు ఉప రవాణ శాఖ కమిషనర్ షేక్.కరీం పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా పర్మిట్ కండిషన్ ఉల్లంఘించిన 18 బస్సులుపై కేసులు నమోదు చేశారు. అందులో అగ్నిమాపక పరికరం లేని బస్సులుపై మూడు కేసులు, యూనిఫారం లేకుండా తిరుగుతున్న డ్రైవర్లపై 11 కేసులు, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించినందుకు 2 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మొత్తం 21 బస్సులుపై కేసులు నమోదైనట్లు చెప్పారు. విద్యా సంస్థలకు చెందిన బస్సులకు సరైన ఫిట్‌నెస్ లేని వాహనాలకు, పరిమిట్ కండిషన్ ఉల్లంఘించే స్కూల్ బస్సులుపై ప్రత్యేక తనిఖీలు జిల్లా వ్యాప్తంగా చేపడతామన్నారు.

మెరుగైన పారిశుద్ధ్య దిశగా చర్యలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగరంలో మెరుగైన పారిశుధ్యం దిశగా చర్యలు తీసుకోవాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ అన్నారు. మంగళగిరి పట్టణంలోని ఇస్లాంపేట(8వ సచివాలయం) పరిధిలో మంగళవారం కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులు, వర్కర్ల అటెండెన్స్‌ను పరిశీలించారు. సచివాలయ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు అందరూ సరైన సమయపాలన పాటిస్తూ నిర్ణిత సమయానికి విధులకు హాజరయ్యేలా చూడాలని సెక్రెటరీలకు ఆదేశించారు. డయేరియా ఇతర సీజనల్ వ్యాధులపై తగు జాగ్రత్తలు తీసుకొనేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీహెచ్ఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులతో ఎమ్మెల్యే మాధవి సమీక్ష

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ విద్యాశాఖ అధికారులతో నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధముగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనీ, ప్రభుత్వం కార్పొరేట్ విద్యాలయాలతో సమానంగా విద్యార్థులకు యూనిఫామ్, బ్యాగ్, పుస్తకాల కిట్లు అందజేస్తున్నదని విధ్యార్థుల తల్లితండ్రులకు వివరించాలన్నారు. విద్యార్థులు మెరుగయిన ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవి అధికారులకు సూచించారు.

ఎమ్మెల్యే బూర్లను కలిసిన లాల్ వజీర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జనాభా దామాషా ప్రకారం కార్పొరేషన్‌కు నిధులు విరివిగా స్వయం ఉపాధి రుణాలు మైనార్టీ ముస్లింలకు వర్తించే పథకాలను దూదేకులకు వర్తింపజేయాలని రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ లాల్ వజీర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులును మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు, శాలువాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దూదేకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ముస్లిం, నూర్ బాషాలను వేర్వేరుగా గుర్తించేలా జనగణన చేపడతామన్నారు. అదేవిధంగా ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి స్వయం ఉపాధికి రుణాలిస్తామన్నారు. సెక్యులర్‌గా ఉన్న మైనార్టీ హోదాకు సంబందించి జీఓ తెచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కోర్టులో ఉన్న ఓబీసీ 4.5 శాతం రిజర్వేషన్ ప్రక్రియ త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మైనార్టీ బడ్జెట్‌లో, దూదేకుల కార్పొరేషన్‌కు రూ.100కోట్లు కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, కూరపాటి నాగేశ్వరరావు, లోకేష్, మస్తాన్‌వలి, శిశ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలలో మాదల శకుంతలమ్మ సంస్మరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు తారకరామ నగర్, శ్రీనివాస నగర్ కాలనీలోని మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు మాదల శకుంతలమ్మ సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కళాశాల వ్యవస్థాపకులు, వైస్ ఛైర్మన్ మాదల రత్నగిరి బాబు, జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మాదల సుధాకర్, మాదల చైతన్య, మాదల శ్రీరామ్ భాస్కర్, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, నామినేని కోటేశ్వరరావు, కళాశాల ట్రెజరర్ గోపిచంద్, ప్రిన్సిపల్ బిందు, కళాశాల సిబ్బంది, జనచైతన్య సిబ్బంది, పాల్గొని నివాళులర్పించారు.

ఫారుఖ్ శుబ్లికి కూటమిలో స్థానం కల్పించాలి

విశాలాంధ్ర- తెనాలి : ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ముస్లిం సంఘాలను ఐక్యపరచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి విశేష కృషి చేసిన ఫారుఖ్ శుబ్లి నూతన ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర ఇమామ్ మజ్లిస్ కమిటి అధ్యక్షులు ఫరీద్ అన్నారు. మంగళవారం జామియా మసీదు ప్రాంగణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి ప్రయత్నంలోనే ముస్లింలను గుర్తించి నంద్యాల ఫారుఖ్‌కు మంత్రి పదవి ఇచ్చినందుకు మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. షేక్ సత్తార్, లాల్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరులోపు ఆస్తి పన్ను చెల్లించాలి : మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-నరసరావుపేట: ఈ ఏడాది 2024-2025కు సంబంధించి పట్టణవాసులు ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలముల పన్నులను ఈ నెలాఖరులోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జులై ఒకటి తర్వాత పన్నులు చెల్లించే వారిపై నూటికి రెండు రూపాయలు వడ్డీ వసూలు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు సకాలంలో పనులు చెల్లించి పరిపాల సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ : నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు, బీసీ సెల్ జిల్లా సాధికారిక ప్రతినిధి గుంజి కాళింగ రాజు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కాళింగ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కావడం నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా స్థానిక శాసనసభ్యులుగా జీవి భారీ మెజారిటీ సాధించిన నేపథ్యాన్ని పురస్కరించుకొని మా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొమెర వెంకట రాయుడు, బండారు శివయ్య, బండారు గురవయ్య, చల్ల వెంకట అంజి, గుంజి వెంకట నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

విశాలాంధ్ర-రెంటచింతల: స్థానిక ఎంపీపీ కార్యాలయం దగ్గర మంగళ వారం జరిగిన రహదారి ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలైనాయి. గురజాల నుండి మాచర్ల, వెళుతున్న ఆర్టీసీ బస్సు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహన దారుని ఢీకొట్టింది. వాహన చోదకుడు కోటిరెడ్డి కిందపడ్డాడు. తలకు బలమైన గాయానాయి. వెంటనే కోటిరెడ్డిని గురజాల వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు పరిశీలిస్తున్నారు.

కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు

విశాలాంధ్ర-రెంటచింతల: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందని సతీమణి జూలకంటి శోభా రాణి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని తుమ్మకోటలో వేల్పుల ఏసు వివాహ వేడుకలో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట టీడీపీ నేతలు సతీష్, పున్నారావు, మాధవ రావు, అనిల్, రాజారెడ్డి, బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-వినుకొండ : పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో సోమ వారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న శాసనసభ్యులు జీవి ఆంజనేయులు మృతి చెందిన మౌలాలి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పిం చారు. అనంతరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు బొల్లా పల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన షేక్ మౌలాలి వినుకొండ పట్టణంలోని 22 వార్డులో నివాసం ఉంటూ వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన తల్లి మరణించడంతో వెళ్లి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ కార్యాలయానికి నోటీసులు

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణ పరిదిలోని జిల్లా కలెక్టర్ కార్యాల యం సమీపంలో ఎకరం స్థలంలో నిర్మించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా కార్యాలయం భవన్ సముదాయానికి సంబంధించి అనుమతులు లేకుండా నిర్మించారని, ఇందుకు సంబం ధించి వారం రోజుల్లో సమా ధానం చెప్పాలని కోరుతూ పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథా రిటీ ప్లానింగ్ ఆఫీసర్ పేరుతో ముద్రించిన లెటర్ ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గోడకు అధికారులు మంగళవారం ఉద యం అంటించారు. లింగంగుంట్ల అగ్రహారం గ్రామ పరిధిలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో రెండేళ్ల క్రితం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మాణానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవం చేశారు.

రజినికి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-వినుకొండ : విను కొండ పట్టణం సంజీవ్ గాంధీ నగర్‌కు చెందిన 9వ తరగతి చదువుతున్న వేముల రజిని మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నిక లలో వినుకొండ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి జీవి ఆంజనేయులు అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ ఈ పాప ఎన్నికలకు ముందే "జీవి ఆంజనేయులు ఎమ్మెల్యేగా గెలిచియున్నాడు" "జీవి ఆంజనేయులు ఎమ్మెల్యేగా గెలిచియున్నాడు" అనే వాక్యాన్ని రామకోటి మాదిరిగా నాలుగు పుస్తకాలు రాయటం జరిగింది. శ్రీమతి లీలావతి మంగళవారం తమ నివాసానికి వేముల రజిని, కుటుంబ సభ్యులను పిలిపించుకొని పూల మాలలతో దుశ్శాల వలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

పది మార్క్ లిస్ట్ పోయినది

కేతావత్ వైష్ణవి భాయి, తండ్రి **కోటేశ్వరరావు నాయక్** అను నేను పల్నాడు జిల్లా, దుర్గి మండలం, నిదానంపాడు గ్రామనివాసినై యున్నాను. అయితే నాకు సంబంధించిన **హాల్ టికెట్ నెం.2014121463** గాగల టెన్త్ క్లాస్ ఒరిజినల్ సర్టిఫికెట్లు (మార్క్ లిస్ట్) ఈనెల 10వ తేదీన, మా స్వగ్రామమైన నిదానంపాడు నుండి మండల కేంద్రమైన దుర్గికి ఆటోలో వెళుతుండగా కనిపించకుండా పోయినవి. ఎంత వెతికినసూ కనబడటం లేదు. నాకు సంబంధించిన సర్టిఫికెట్లు ఎవరికైన దొరికిన యెడల సెల్ **9000042984, 7815861508** నెంబర్ కు తెలియజేయగలరు.